Ananth & Ananth Series



# సూర్యదేవర రామ్ మోహన రావు

**Author of Highest Number of Novels In Telugu**

2 0 1 9

126 వ నవల



# డబ్బులెవరికీ ఊరికే రావు - 2

# DEBBULEVARIKE VOORKERAAVU -2nd Part

(Serialised in 'Swathi' weekly)

By

**SURYADEVARA RAM MOHANA RAO**

Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Nava Nirman Nagar, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**MODEL PUBLICATIONS**

Edition : **2019**

Price :
**₹. 90-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
Vijayawada.

# డబ్బులెవరికీ ఊరికే రావ్వు-2

కశ్యప్ ఆటో గ్యారేజ్...

స్పెషల్ బ్రాంచ్ కామ్య, విశ్వాస్‌లు వెళ్ళిపోయిన కాసేపటికే సింధూర కూడ కావేరితో తన కార్లో వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ రాత్రికి తన ఇంటికొచ్చేలా కశ్యప్ నుంచి ప్రామిస్ తీసుకు మరీ వెళ్ళింది.

అలా వాళ్ళంతా వెళ్ళిపోగానే-

కశ్యప్‌ని తిరిగి ఆలోచనలు చుట్టుముట్టాయి.

పని కుర్రాళ్ళకి వర్క్ గురించి సూచనలిచ్చి-

రెస్ట్‌రూంలో కొచ్చేసాడు.

బెడ్‌మీద పడుకున్నాడు.

ఈ మూడు రోజులుగా జరిగిన సంఘటనలన్నీ వరసగా కళ్ళముందు కదిలాయి. జరిగిందేమిటన్న కోణంలో కశ్యప్ ఆలోచనలు సాగాయి.

మొన్న మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో నిషాంత్ వైఫ్ సుమిత్ర నుంచి తన సెల్‌కి ఫోన్ వచ్చింది. కిడ్నాప్ డ్రామా గురించి ఫోన్‌లో చెప్పింది. తను సహకరించనని చెప్పాడు. ఎందుకంటే ఇలాంటి ఇల్లీగల్ యాక్టివిటీస్ అంటే అస్సలు గిట్టదు. అయినా తను నేరుగా వచ్చి మాట్లాడతానంది. ఆమెను వదిలించుకునే ఉద్దేశంతో పది లక్షలు క్యాష్ ఇచ్చేట్టయితే వచ్చి మాట్లాడమన్నాడు. డబ్బు అడిగాడు గాబట్టి ఇక రాదనుకున్నాడు.

అనుకున్నాడు గాని... వస్తేనే బాగుండని కూడా అనుకున్నాడు. తన అప్పులవాళ్ళ ఒత్తిడి అలాంటిది. మనశ్శాంతి లేకుండా పోయింది. అప్పులు తీర్చి ప్రశాంతంగా బతకటమో... రాత్రికి రాత్రి సుదూరంగా పారిపోవటమో... ఈ రెండు మార్గాలే తన ముందున్నవి. సుమిత్ర రాదనే అనుకున్నాడు.

కాని తన అంచనా తప్పింది. మూడు గంటల ప్రాంతంలో వర్షంలో తన వద్ద కొచ్చింది. పది లక్షలు క్యాష్ ఇచ్చింది. తన ప్లాన్ చెప్పింది. రిస్క్ ఏమాత్రం లేదంది. వచ్చే యాభై కోట్లలో చెరో పాతిక తీసుకుందామంది. తనూ డబ్బు అవసరంలో వున్నాడు గాబట్టి ధైర్యం చేసి ఒప్పుకున్నాడు.

తర్వాత ఇక్కడికి మూడో వీధిలోని తన ఫ్రెండు గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్ళింది. తనను తాళ్ళతో బంధించి ఫోటోలు తీయమంది. అలా తీసిన ఫోటోలను నిషాంత్ సెల్‌కి పంపించింది. తను బయటికొచ్చి నిషాంత్‌కి కిడ్నాపర్‌గా ఫోన్ చేసాడు. అతను యాభై కోట్లు తెచ్చి ఎగ్మోర్ స్టేషన్లో యివ్వటానికి అంగీకరించాడు. ఎగ్మోర్ స్టేషన్లో హైడ్రామా... పోలీసుల ట్రాప్‌లో చిక్కకుండా తను వెనక్కి వచ్చేసాడు.

గెస్ట్‌హౌస్‌కి వెళ్ళేసరికి సుమిత్ర హత్య చేయబడుంది. సరిగ్గా అదే సమయంలో పోలీసులు వచ్చారు. వాళ్ళకి చిక్కకుండా శవాన్ని తప్పించాడు. నిన్న సాయంత్రం టి.వి. ప్రకటనలో సుమిత్ర ఫోటో చూసాకే– ఆ ఫోటోలో పుట్టుమచ్చ గమనించాకే డౌటు వచ్చింది.

రాత్రి రెండోసారి మడ అడవికెళ్ళి పూడ్చిన గొయ్యి తవ్వి శవాన్ని పరిశీలించినప్పుడు పుట్టుమచ్చ లేదని నిర్ధారణయింది. అంటే చనిపోయింది అసలు వైఫ్ సుమిత్ర. తన వద్దకొచ్చింది అచ్చం సుమిత్రలా ఉండే నిషాంత్ ఫేక్ వైఫ్. దాంతో తనకో క్లారిటీ వచ్చేసింది. కాని చాలా ప్రశ్నలకు ఇంకా సమాధానాలు దొరకాల్సి వుంది.

భార్య సుమిత్రను నిషాంత్ ఎందుకు చంపాడు?

తన వద్దకొచ్చిన ఫేక్ వైఫ్ సుమిత్ర కూడ అసలు సుమిత్రలాగే గుర్తుపట్టలేనంత దగ్గర పోలికలతో ఎలా వుంది? ఈమెకూ నిషాంత్‌కు మధ్య సంబంధం ఎలాంటిది? ఈమె నిషాంత్ ఆడించిన నాటకంలో ఒక పాత్ర మాత్రమేనా? ఆ పాత్ర ముగియటంతో వెళ్ళిపోయిందా? ఆమె అసలు పేరేమిటి? ఎక్కడుంటుంది?

తనను హత్యానేరంలో ఇరికించి ఆ విధంగా శిక్ష నుంచి తప్పించుకోవచ్చన్నది నిషాంత్ ప్లానా? అదే కారణమైతే తననే ఎందుకు ఎంచుకున్నాడు. తనకన్నా అమాయకులు, బ్యాంకుకి బాకీ పడిన ఖాతాదారులు చాలామందే ఉంటారు. వాళ్ళని వదిలేసి కశ్యప్ అనే తనలాంటి గ్యారేజ్ మెకానిక్‌నే టార్గెట్ చేయటం ఏమిటి? ఏ ఒక్క ప్రశ్నకీ తన వద్ద సమాధానం లేదు. ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం తెలియాలంటే ఫేక్ వైఫ్‌ని పట్టుకోవాలి.

అసలు మొన్న రాత్రి గెస్ట్‌హౌస్‌కి చేరుకున్న కొద్ది క్షణాల్లోనే పోలీసులు రావటం ఏమిటి? పోలీసులకు ఎవరో ఫోన్ చేయటం అబద్ధం

కాదు. అంటే తనను ఫూల్‌ని చేసిన నిషాంత్ ఫేక్ వైఫ్ వెళ్ళిపోలేదు. ఆ వర్షంలో ఆమెను తీసుకుపోడానికి ఓ కారు ఆ పరిసరాల్లో ఎక్కడో వుండి ఉండాలి. తను బయటికెళ్ళగానే సుమిత్ర శవాన్ని బెడ్‌మీద ఉంచి ఆ కార్లో వెళ్ళి ఎక్కడో ఆగి ఉంటుంది. తన వ్యాన్ రావటం చూడగానే డ్రయివర్ చేత పోలీసులకు ఫోన్ చేయించి వెళ్ళి పోయుంటుంది. ఇదే జరిగుండాలి.

సో... ఇప్పుడా మాయలేడిని పట్టుకుంటే గాని తెరవెనక ఏం జరిగిందన్నది తెలీదు. ఎక్కడవున్నా ఏదో టైంలో ఆమె బయటికి రాక తప్పదు. వెదకాలి... సిటీ జల్లెడ పట్టయినా పట్టుకోవాలి. రెండు వందల చదరపు కిలోమీటర్ల మహానగరం చెన్నై. అంత ఈజీ కాదు. అయినా తప్పదు. ఇవాళ గాకుంటే రేపు కంట బడకపోదు.

ఈ విధంగా ఆలోచనలు ఓ కొలిక్కి రాగానే ఇక షెడ్‌లో ఉండలేకపోయాడు కశ్యప్. కుర్రాళ్ళతో చెప్పి వెంటనే తన బైక్‌మీద సిటీలోకి బయల్దేరాడు.

✳ ✳ ✳ ✳ ✳

పరశువాక్కం పోలీస్ స్టేషన్నుంచి బయలుదేరిన కామ్య, విశ్వాలు కాసేపు మౌనంగానే ఉండిపోయారు. కారు మెత్తగా పారిస్ కార్నర్ దిశగా పరుగుతీస్తోంది.

"కామ్యా డియర్!" పిలిచాడు విశ్వాస్.

"వింటున్నా చెప్పు" తలతప్పికుండానే అడిగింది కామ్య. ఆమె దృష్టి డ్రైవింగ్‌మీదే వుంది.

"ఏంలేదు. ఇంతవరకు జరిగింది చూస్తే మనకు కశ్యప్ కన్నా బ్యాంకర్ నిషాంత్‌పైనే ఎక్కువ సందేహాలున్నాయి. అయినాకూడ–

ఎలాగయినా కశ్యప్‌ని అరెస్ట్ చేసి లోనపడేయాలన్న పట్టుదల నీలో కన్పిస్తోంది. ఎందుకు?" అడిగాడు విశ్వాస్.

"నీకలా అర్థమైందా?"

"ఎస్... వాడిమీద ఫోకస్ పెట్టి ఇబ్బంది పెట్టాలా? ఎందుకు వాడ్నే టార్గెట్ చేయటం?"

"నో నో... యూ ఆర్ రాంగ్. కశ్యప్‌ని టార్గెట్ చేస్తోంది నేను కాదు. నిషాంత్ టార్గెట్ చేస్తున్నాడు. నా ప్రయత్నం కశ్యప్‌ని కాపాడ్డం కోసమే"

"వ్వాట్... కాపాడాలనా?"

"ఎస్... కాపాడాలనే. ఆ కాల్‌గర్ల్‌ను అడ్డంపెట్టుకుని ఈరోజు కూడ తప్పించుకున్నాడు. అదే కశ్యప్ చేస్తున్న తప్పు. తను మననుంచి తప్పించుకునే కొద్దీ మరిన్ని ప్రాబ్లమ్స్‌ని ఫేస్ చేయక తప్పదు"

"కాస్త వివరంగా చెప్తావా? నీ అనాలసిస్ నాకర్థమై చావట్లేదు"

"కశ్యప్‌ని నేనోమాటడిగాను గుర్తుందా? వర్షంలో ఓ అమ్మాయి నీ గ్యారేజ్ ముందు ఆటో దిగి లోనకొచ్చినట్టు మా దగ్గర ఇన్ఫర్మేషనుంది అవునా కాదాని అడిగాను. కాని ఎవరూ రాలేదని బొంకాడు. వాస్తవానికి ఆ ప్రశ్న నేను గుడ్డిగా అడిగింది కాదు"

"మరి?"

"ఈ రోజు ఉదయం నా సెల్‌కి ఓ ఫోన్ కాల్ వచ్చింది. అప్పటికి నువ్వింకా లేవలేదు. ఎవడో అజ్ఞాత వ్యక్తి. బొంగురు గొంతు. మొన్న సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో వర్షంలో ఆటో దిగి సుమిత్ర కశ్యప్ గ్యారేజ్‌లోకి వెళ్ళటం తను చూసాట్ట. వెంటనే కశ్యప్‌ని అరెస్ట్ చేస్తే సుమిత్ర ఆచూకీ తెలిసిపోతుంది. మీరిచ్చిన టి.వి. ప్రకటన చూసి ఫోన్ చేస్తున్నా. సుమిత్రని కాపాడండి అన్నాడు ఆ అజ్ఞాత వ్యక్తి"

"ఇంట్రస్టింగ్... తర్వాత?" కుతూహలంగా అడిగాడు విశ్వాస్.

"యూ నో... మనం నిన్న సాయంత్రం టి.వి. ప్రకటన ఇచ్చినప్పట్నుంచి సుమిత్ర గురించిగాని కిడ్నాపరు ఆచూకీ గురించిగాని ఒక్క ఫోన్‌కాల్ కూడ రాలేదు. ఎవరు నువ్వని అడిగాను. నేనెవరైతే మీకెందుకు మేడం. వెంటనే కశ్యప్‌ని అరెస్ట్ చేసి సుమిత్రను కాపాడండి అంటూ ఫోన్ పెట్టేసాడు"

"సో... సుమిత్ర కశ్యప్ వద్ద కొచ్చినట్టు తెలిసిపోయింది. కిడ్నాపరుగా ఫోన్‌లు చేసింది డబ్బు కోసం ఎగ్మోర్ స్టేషన్‌కొచ్చింది వాడే. అంటే కశ్యప్ క్రిమినల్. అలాంటి వాడ్ని కాపాడవలసిన అగత్యం ఏముంది?"

"విశ్వా...! నీ బుర్ర అప్పుడప్పుడూ రాంగ్ రూట్‌లో ఆలోచిస్తుంది. నిషాంత్ వైఫ్ సుమిత్ర ఎలా వుంటుందో హైసొసైటీలో వాళ్ళకి తప్ప దిగువస్థాయి వాళ్ళకి తెలీదు. తెలిసినా ఆ వర్షంలో ఆటో దిగి గ్యారేజిలోకి వెళ్తున్న లేడీని ఎవరో గుర్తించటం సాధ్యం కాదు"

"అంటే?"

"మనం ప్రకటనలో ఇచ్చిందేమిటి? సుమిత్ర ఆచూకీగాని కిడ్నాపరు ఆచూకీ గాని తెలిసినవాళ్ళు ఫోన్ చేయమని నా నెంబరిచ్చాం. కాని ఫోన్ చేసిన వాడు ఆచూకీ మాత్రమే చెప్పాలి. కశ్యప్‌ని అరెస్ట్ చేసి సుమిత్రను కాపాడమంటున్నాడు. దీన్నిబట్టి అర్థంగావటం లేదూ! నిషాంత్ తన మనిషి చేత అలా ఫోన్ చేయించాడని! కశ్యప్‌ను ఎలాగైనా లోన వేయించాలనే ఆత్రం నిషాంత్‌లో ఉంది. దీన్నిబట్టి నిషాంత్‌కు తెలిసే ఈ కిడ్నాప్ డ్రామా నడిచిందనీ అర్థమవుతోంది.

మొదట మనం డబ్బు కోసం సుమిత్రే కిడ్నాప్ డ్రామా నడుపుతోందనుకున్నాం. కాని అసలు సూత్రధారి నిషాంత్ కావచ్చునిపిస్తోంది"

"నో నో కామ్యా! నువ్వు మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావనుకుంటా. అసలు సూత్రధారి నిషాంత్ అనుకుంటే అతనికేంటి లాభం?"

"అదేగా మనం తెలుసుకోవాలి. ఏదో కారణం వుంది. అందుకే కశ్యప్‌ని టార్గెట్ చేస్తున్నాడు"

"ఆ మాటకొస్తే కశ్యప్ మీద మనకూ కొన్ని డౌట్లున్నాయి. వాడ్నే కిడ్నాపర్‌గా అరెస్ట్ చేయగలమా... లేదు కామ్యా. బహుశ కశ్యప్‌ని అరెస్ట్ చేయిస్తే తన భార్య త్వరగా తిరిగొస్తుందన్న ఆశతో ఫోన్ చేయించి ఉండొచ్చు"

"అదే... కశ్యప్‌ని అరెస్ట్ చేయించే ఆలోచన ఎందుకు? ఎందుకంటే కిడ్నాప్ డ్రామాలో భాగంగా సుమిత్ర కశ్యప్ వద్దకే వెళుతుందని నిషాంత్‌కు ముందే తెలుసు. సూత్రధారి వాడే గాబట్టి తెలుసు. ఎటొచ్చి మళ్ళీ ఫోన్ చేయకుండా డబ్బు డిమాండ్ చేయకుండా కశ్యప్ సైలెంట్‌గా ఉండటమే ఆశ్చర్యం. ఏదో జరిగింది... అదేమిటో తెలియాలి"

"ఓకే ఓకే! అలాగే అనుకుందాం. ఇంతకూ అసలు వైఫ్ ఇంకా ఫారెన్‌లోనే ఉందా? ఒకవేళ సువిధ మాట్లాడాక వెంటనే వచ్చేసిందా..? ఎక్కడున్నట్టు?"

"ఇది మనకి చాలా ఇంపార్టెంట్. ఈ విషయం తెలియాలంటే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీస్‌ను కలిసి ప్యాసింజర్స్ లిస్ట్ చెక్ చేయాలి. లంచ్ తర్వాత అటు వెళ్ళి ఆ తర్వాతే నిషాంత్‌ను కలుద్దాం"

మాటల్లోనే కారు పారిస్ కార్నర్‌లోని ఫ్లవర్ మార్కెట్ ఏరియాకు చేరుకుంది. ఆ పక్కనే మంచి రెస్టారెంట్ ఉంది. కారును పార్కింగ్‌లో వుంచి ఇద్దరూ హొటల్లోకి ఎంటరయ్యారు.

* * * * *

తన షెడ్ నుంచి బైక్ మీద బయలుదేరిన కశ్యప్ దారి పొడవునా పరిపరివిధాలా ఆలోచిస్తూనే వున్నాడు. మాయలేడి సుమిత్ర తనకు

ఎక్కడ కన్పించే అవకాశం ఉంది? షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్, ఖరీదైన రెస్టారెంట్స్, జూ, పార్క్ ఎక్కడ ఉంది అవకాశం?

ఎక్కడ కన్పించాలన్నా ముందు ఆమె బయటికి రావాలి. తనకు ఆడంబరంగా జీవించటం అలవాటు గాబట్టి ఇంట్లో ఉండదు. ఏదో టైంలో ఖచ్చితంగా బయటికొస్తుంది. ఇవాళ గాకుంటే రేపు తన కంటబడి తీరాలి.

ఆలోచనల్లో మునిగిన కశ్యప్ చాలా సేపటి తర్వాతగాని తోకలా తన వెనకే వస్తున్న బైక్‌కి గుర్తించలేదు.

నిజానికి ఒకటి కాదు-

రెండు బైక్‌లు ఫాలో అవుతున్నాయి.

ఒకటి నిఘా పోలీస్ బైక్. ఇతను చాలా తెలివైన వాడు. నిన్నటి వాడు కాదు. కశ్యప్ దృష్టిలో పడని విధంగా సుమారు మూడు వందల గజాల దూరాన్ని మేనేజ్ చేస్తూ వస్తున్నాడు. కాని రెండో బైక్ మీది రౌడీలిద్దరికీ అంత అనుభవం లేదు. అందుకే మరీ యాభై గజాలలోపు దూరంలోనే క్లోజ్‌గా ఫాలో అవుతున్నారు. వ్యూ మిర్రర్‌లో ఆ బైక్‌ని దానిమీది ఇద్దర్నీ గమనించేసాడు.

అసలే తిక్కలో వున్న కశ్యప్‌కి-

ఆ బైక్‌ను గమనించగానే సర్రున ముంచుకొచ్చింది కోపం. మరో నాలుగు రోడ్లు క్రాస్ చేయగానే మిగిలిన డౌటు కూడ తీరిపోయింది. ఆ బైక్ తనను ఫాలో చేస్తోంది. వాళ్ళని కార్నర్ చేసి నాలుగు పీకితే వీళ్ళను పంపించిన వాడెవడో తెలిసిపోతుంది.

వెంటనే బైక్‌ని ఒకపక్క వీధిలోకి పోనిచ్చాడు కశ్యప్. వ్యూ మిర్రర్‌లో ఆ బైక్ కూడ అదే సందులోకి తిరగటం గమనించాడు. ఒక మలుపులో బైక్‌ని పక్కకు తీసి గోడ పక్కకు ఆపేసాడు. అక్కడి నుంచి గీత గీచినట్టు స్ట్రయిట్‌గావున్న వీధిలో కన్పించకపోడంతో కంగారుపడి

బైక్ వేగం పెంచారు వాళ్ళు. వెంటనే ఆ బైక్‌ను వేగంగా వెంబడించాడు కశ్యప్.

ఆ వీధి ఎగువన ఒక పెద్ద రోడ్డును కలుస్తుంది. రివ్వున దూసుకొచ్చిన కశ్యప్ పెద్ద రోడ్డు ఎక్కకముందే ఆ బైక్‌ని అడ్డం కొట్టేసాడు. తన బైక్ స్టాండ్ వేస్తూనే భూతంలా వాళ్ళమీద విరుచుకుపడ్డాడు. వాళ్ళిద్దరూ ఎదిరించాలని చూసారుగాని కశ్యప్ దూకుడును ఆపలేకపోయారు. ఎక్కడ తగులుతుందో కూడ చూడకుండా చితగ్గొట్టేస్తూ– "చెప్పండ్రా! నా వెంట ఎందుకు పడుతున్నారు? మిమ్మల్ని ఎవడు పంపించాడు? చెప్పకపోతే ఛస్తారు" అంటూ ఉగ్రుడై అరిచాడు.

"మాకేం తెలీదు బాబోయ్! మమ్మల్నెవరూ పంపించలేదు. మమ్మల్ని వదిలేయండి సారూ!" అంటూ ఏడ్చేసారు వాళ్ళు.

"పంపించకుండానే నా వెంట తిరుగుతున్నారా మీరు? నిజం చెప్పకపోతే చచ్చారే" కాళ్ళతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ అరుస్తున్నాడు కశ్యప్. ఈ గొడవకి చుట్టూ జనం చేరిపోయారు. ఏం జరిగిందో తెలీక వేడుక చూస్తున్నారు.

ఇలాంటి సందర్భాల్లో పంచాయితీ నిర్వహించి తక్షణం తీర్పునిచ్చే పెద్దమనిషి వీధికొకడుంటాడు. అలాంటి పెద్దాయనే ఒకడు జనాన్ని తోసుకుని ముందుకొచ్చాడు.

"ఆగండయ్యా ఆగండి. రోడ్డుమీద ఏంటీ న్యూసెన్స్. ఆగు" అంటూ కశ్యప్‌ని వెనక్కి లాగాడు.

ఇంకో రెండు నిముషాలాగితే–

రౌడీల నోటి తాళం వూడిపోయేదే!

కాని పెద్దాయన జోక్యంతో వాళ్ళకి ధైర్యం చిక్కింది. చివ్వునలేచి కశ్యప్‌కి అందకుండా పెద్దాయన వెనక్కి వెళ్ళారు.

"చూడండి సార్! అన్యాయంగా మమ్మల్ని కొట్టేస్తున్నాడు. మాకే పాపం తెలీదంటే నమ్మటం లేదు. ఎవరు పంపించారో చెప్ప

మంటున్నాడు. చంపేసేలా వున్నాడు. కాపాడండి సార్" అంటూ ఏడ్చేసారు.

"అసలేంటయ్యా మీ గొడవ? వీళ్ళనెందుకొట్టాడుతున్నావ్?" కశ్యప్‌ని నిలదీసాడా పెద్దమనిషి.

"కొట్టాలా చంపాలా వీళ్ళని. నేను బయలుదేరినప్పట్నుంచి వీళు ళ్ళ నన్నే ఫాలో అవుతున్నారు. ఎటు వెళ్తే అటు ఎక్కడికెళ్తే అక్కడికి. వదలకుండా వెంబడిస్తున్నారు. ఎవరు పంపించారంటే చెప్పటం లేదు. మీరు కాసేపు పక్కకెళ్ళండి. ఇప్పుడే తేల్చేస్తాను వీళ్ళ సంగతి" అరుస్తూ ఆవేశంతో వాళ్ళ మీదకు పోతుంటే మళ్ళీ ఆపాడు పెద్దాయన.

"అయ్య బాబోయ్! చంపేసేట్టున్నాడు సార్ దుర్మార్గుడు. మేం ఫాలో అవటం ఏంటి సార్. మేం వెళ్ళే రూట్‌లోనే తనూ వెళ్తున్నాడు. అంతే"

"అంతే ఏమిట్రా! ఈ గల్లీ కూడ మీ రూట్‌లోనే వుందా?" అరిచాడు కశ్యప్.

"సరి సరి. కుర్రాళ్ళు చచ్చిపోతారయ్యా. మరీ అంతగా కొట్టాలా. తమకేం తెలీదంటున్నారుగా. వదిలెయ్. పోలీసులొస్తే న్యూసెన్స్ కింద మీ అందర్నీ లోనపడేస్తారు. వదిలెయ్. పొండిరా" అంటూ తీర్పు చెప్పేసాడా పెద్దమనిషి.

వదిలిందే చాలన్నట్టుగా రౌడీలిద్దరూ తమ బైక్ మీద పారిపోయారు. చుట్టూ మూగిన జనం చెదిరిపోనారంభించారు. ఇక చేసేదేమీ లేక తన బైక్ స్టార్ట్ చేసి కదిలాడు కశ్యప్. కొంత దూరంలో ఆగిన నిషా పోలీస్ జరిగిందంతా గమనిస్తున్న సంగతి కశ్యప్‌కు తెలీదు.

✳ ✳ ✳ ✳ ✳

పారిస్ కార్నర్.

లంచ్ చేయడానికి హోటల్లోకి ఎంటరవుతూండగా కామ్య సెల్‌ఫోన్ మోగింది. ఫోన్ తీస్తూ యథాలాపంగా రోడ్‌వైపు చూసిన కామ్యకు అంతదూరంలో షాపింగ్ మాల్ పార్కింగ్‌లో ఒక దృశ్యం కంటబడింది. అప్పుడే రెండు కార్లు వచ్చి పక్క పక్కనే ఆగాయి. విడివిడిగా కార్లు దిగిన ఆ ఇద్దరూ కలిసి షాపింగ్ మాల్లోకి వెళ్ళారు. అవునా కాదా... తను పొరబాటు పడిందా అనుకొంటూనే చూపు అటే వుంచి సెల్ ఆన్ చేసింది.

“నేను మేడం. వన్నాట్ సిక్స్. కానిస్టేబుల్ దండపాణిని” చెప్పాడు అవతలి వ్యక్తి.

“ఎవరు?” పక్కనే వున్న విశ్వాస్ కామ్యను అడిగాడు.

“దండపాణి. జస్ట్ వెయిట్ ఎ మినిట్” అంటూ విశ్వాస్ వంక చూసింది కామ్య.

“కశ్యప్‌ని ఫాలో చేయమని చెప్పాంగా... కానిస్టేబుల్ దండపాణి” గుర్తుచేసింది.

“ఆఁ... ఎస్... ఎస్...”

“ఓకే డియర్! నువ్వెళ్ళి లంచ్ ఆర్డర్ చెయ్. రెండు నిముషాల్లో వచ్చేస్తాను”

“రెండు నిముషాలేగా! అర్జంటేముంది ఉంటాలే”

“వెళ్ళమంటున్నాగా. యూ గో...”

“ఉంటే ఏమైంది?”

“అమ్మాయిలకు సైట్ కొడదామనా?”

“ఓరి దేవుడా... ఆడాళ్ళకి ఇంత వికారం బుద్ధిచ్చావేంటయ్యా. మగజాతిని పీడించటమే వీళ్ళ పనా... ఓకే! వెళ్ళక ఛస్తానా. త్వరగా రా” అని విసుక్కొంటూ లోనకెళ్ళిపోయాడు విశ్వాస్.

తను ఏం చూసిందో విశ్వాస్‌కి చెప్పటం కామ్యకు ఇష్టం లేదు. అందుకే అతడ్ని లోనకి పంపించేసింది.

"చెప్పు దండపాణి. ఏదన్నా విశేషం ఉందా? కశ్యప్ ఎక్కడి కెళ్ళాడు?" అడిగింది. ఆమె దృష్టి మాత్రం షాపింగ్ మాల్ మీదే వుంది.

"నాకో డౌటు. ముందు చెప్పండి మేడమ్. నేనుగాక ఇంకెవరినన్నా కశ్యప్‌ని ఫాలో చేయమని నియమించారా?" అటునుంచి అడిగాడు దండపాణి.

"నో నో... ఎందుకొచ్చిందా డౌటు? ఇంతమంది వెటబడితే కశ్యప్‌కి దొరికిపోతారు. అందుకే నీ ఒక్కడికే ఆ పని వప్పగించాం. ఇంతకూ ఏం జరిగింది?"

"ఏంలేదు మేడమ్! ఇక్కడ పెరుమాళ్ చెట్టి స్ట్రీట్‌లో చిన్న గొడవ. ఏమైందంటే నాకన్నా ముందు ఇద్దరు కుర్రాళ్ళు బైక్‌మీద కశ్యప్‌ని క్లోజ్‌గా ఫాలో అవుతున్నారు. నేనూ వాళ్ళని గమనించాను. కశ్యప్ వాళ్ళని అనుమానించి ఇక్కడ అడ్డంకొట్టి చితగ్గొట్టేసాడు యిద్దర్నీ. ఎవరు పంపించారో చెప్పమని ఎంతకొట్టినా వాళ్ళు చెప్పలేదు. అంతలో ఒక పెద్దాయన విడదీసి వాళ్ళని పంపించేసాడు. నేను కశ్యప్ వెనకే వున్నాను"

"ఓకే! అర్థమైంది దండపాణి. ఆ కుర్రాళ్ళిద్దర్నీ గుర్తుపట్టగలవా? వాళ్ళు మనకి కావాలి"

"సెల్లో ఫోటోలు తీసాను మేడం"

"వెరీగుడ్. అందులో గుర్తించడానికి వీలున్న రెండు ఫోటోలని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించు. ఎక్కడున్నా అరెస్ట్ చేసి వెంటనే కంట్రోల్ రూంకి వప్పగించమను. ఇది నా మెసేజ్‌గా పాస్ చెయ్యి"

"మరి కశ్యప్?"

"వదిలెయ్. ఇప్పుడు నేను చెప్పింది చెయ్"

"ఓకే మేడమ్"

ఫోన్‌లైన్ కట్‌చేసి చేత్తో పట్టుకుని మెట్లు దిగి షాపింగ్ మాల్ వైపు వడిగా నడిచింది కామ్య.

* * * * *

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Dabbulevariki+Voorike+Ravu+2](http://kinige.com/book/Dabbulevariki+Voorike+Ravu+2)**

* * *